సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

శుక్రవారం । 31 । మే । 2024



పొగ.. సెగ

పొగాకు వినియోగం వల్ల వచ్చే సమస్యలపై అవగాహనలేక పలువురు కేన్సర్ బారిన పడుతున్నారు.

8లో



విత్తన దుకాణాల్లో తనిఖీలు

జిల్లాలో పలుచోట్ల అధికారులు విత్తన దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. విత్తన నిల్వలను పరిశీలించారు.

9లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం
41° / 29°

జిల్లాలో శుక్రవారం ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది. సాయంత్రం వరకు వడగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ఘనంగా నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామివారి ఆలయంలో గురువారం స్వామివారి నిత్యకల్యాణం కమనీయంగా జరిగింది. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామివారికి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణగావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు.

పెద్దమ్మతల్లికి సువర్ణ పుష్పార్చన



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి అమ్మవారికి గురువారం వైభవంగా సువర్ణ పుష్పార్చన జరిపారు. మండలంలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయంలో అర్చకులు అమ్మవారికి 108 సువర్ణ పుష్పార్చన, హారతి, మంత్రపుష్పం, నివేదన పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమంలో ఆలయ ఈఓ.సుదర్శన్, వేదపండితులు పద్మనాభశర్మ, అర్చకులు రవికుమార్‌శర్మ పాల్గొన్నారు.

5న రుద్రహోమం

పెద్దమ్మతల్లి ఆలయంలో వచ్చే నెల 5న మాస శివరాత్రి సందర్భంగా రుద్రహోమం నిర్వహించనున్నట్లు ఈఓ జి.సుదర్శన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు యాగశాలలో రుద్రహోమం జరుగుతుందని పేర్కొన్నారు. పూజలో పాల్గొనే భక్తులు రూ.1,516 చెల్లించి గోత్ర నామాలను నమోదు చేసుకోవాలని కోరారు. పూజలో సంప్రదాయ దుస్తులు మగవారు ధోతి, కండువా, మహిళలు చీరలు ధరించాలని కోరారు. పూర్తి వివరాలకు 98669 23261, 63034 08458 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

సమాజం కోసం పాటుపడితే జన్మధన్యం


శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్నజీయర్‌స్వామి



ప్రవచనాలు చేస్తున్న చిన్నజీయర్‌స్వామి

అన్నపురెడ్డిపల్లి: భగవంతుడిని విశ్వాసంతో ఆరాధించి, సమాజం కోసం పాటుపడితే జన్మ ధన్యవుతుందని శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్ స్వామి ప్రవచించారు. గురువారం అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలోని శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామివారి ఆలయాన్ని ఆయన సందర్శించారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయంలో భక్తులను ఉద్దేశించి ప్రవచనాలు చేశారు. బాలాజీ వేంకటేశ్వర స్వామివారి విశిష్టతను వివరించారు. ఆలయ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. వికాస తరంగిణి సమాజానికి సేవలందిస్తోందని, పిల్లలు, మహిళల ఆరోగ్యం కోసం పనిచేస్తోందని పేర్కొన్నారు. సమాజం కోసం పనిచేసే వారిని ప్రోత్సహిస్తామని తెలిపారు. తొలుత చిన్నజీయర్ స్వామివారికి ఎమ్మెల్యే జారే ఆదినారాయణ దంపతులు, గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఆలయ మేనేజర్ పాకాల రమణ, ఆలయ మాజీ చైర్మన్ వనమా గాంధీ, కల్లోజి వెంకటేష్, పర్సా వెంకటేశ్వర్లు, దోసపాటి రాంబాబు పాల్గొన్నారు.

అన్ని రోగాలకూ పంటి డాక్టరేనా?



ఆస్పత్రుల్లో ఎంబీబీఎస్‌లకే డ్యూటీ డాక్టర్ హోదా

- కానీ జిల్లాలో దంత వైద్యులతో ఆ పోస్టులు భర్తీ
- వైద్యవిధాన పరిషత్ నియామకాలపై విమర్శలు
- సీజన్ వస్తే ఇబ్బందులు తప్పవంటూ ఆందోళన

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: వానాకాలం వచ్చిందంటే చాలు ఏజెన్సీ ప్రాంతాల్లో పురిటి నొప్పులతో బాధపడుతున్న గర్భిణులను డోలీలు, మంచాలలో ఆస్పత్రులకు మోసుకొచ్చే ఘటనలు కనిపించడం పరిపాటి. ఈ తరహా అత్యవసర ఆరోగ్య కష్టాలకు చెక్ పెట్టేందుకు మారుమూల ఏజెన్సీ ప్రాంతాలైన చర్ల, అశ్వారావుపేట వంటి చోట్ల ఉన్న ప్రభుత్వ ఆస్పత్రులను అప్‌గ్రేడ్ చేశారు. నూతన భవనాలు నిర్మించారు. ప్రత్యేకంగా ప్రసూతి వార్డులు ఏర్పాటు చేశారు. కానీ కీలకమైన వైద్యుల పోస్టుల భర్తీ విషయంలో పప్పులో కాలేశారనే విమర్శలు వైద్యారోగ్యశాఖపై వస్తున్నాయి. ఉదాహరణకు చర్ల ఆస్పత్రిని పరిశీలిస్తే ఇక్కడ 30 పడకలు ఉన్నాయి. ఇందులో 12 పడకలు ప్రసూతి వైద్యం కోసం కేటాయించారు. ఈ ఆస్పత్రిలో ఇద్దరు ఎంబీబీఎస్, ఒక గైనకాలజిస్టు, ఒక అనస్తీషియన్ మొత్తంగా నలుగురు వైద్యులు ఉండాలి. ప్రస్తుతం ఇక్కడ ఒక ఎంబీబీఎస్ డాక్టర్ ఉండగా ఇటీవల ఇద్దరు డెంటల్ డాక్టర్లను నియమించారు. ఒక్క చర్లలోనే కాదు అశ్వారావుపేట, ఇల్లెందు, మణుగూరు, పాల్వంచ ప్రభుత్వ ఆస్పత్రుల్లో కూడా అవసరానికి మించి దంత వైద్యులు డ్యూటీ డాక్టర్లుగా కొనసాగుతున్నారు.

సిలబస్‌లో తేడా

వైద్య విద్యకు సంబంధించి మొదటి ఏడాదిలో ఇంచుమించుగా అన్ని రకాల వైద్య కోర్సులకు ఒకే రకమైన సిలబస్ ఉంటుంది. అందులో ముఖ్యంగా అనాటమీ (శరీర నిర్మాణ శాస్త్రం), ఫిజియాలజీ (శరీర ధర్మ శాస్త్రం), బయోకెమిస్ట్రీ (జీవ రసాయన శాస్త్రం) సబ్జెక్టులు ఇటు దంత, అటు రెగ్యులర్ ఎంబీబీఎస్ కోర్సుల్లో ఉన్నాయి. కానీ ఆ తర్వాత ఎంబీబీఎస్, దంత వైద్యవిద్యలో సిలబస్‌లు వేర్వేరు అవుతాయి. అందువల్లే తెలంగాణ రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ వివిధ రకాలైన ప్రైవేటు, ప్రభుత్వ ఆస్పత్రులలో డ్యూటీ డాక్టర్లుగా ఎంబీబీఎస్ పట్టా కలిగిన వైద్యులనే నియమించాలనే నిబంధన విధించింది. ఎంబీబీఎస్‌కు సమాన హోదా కలిగిన బీఏఎంఎస్ (ఆయుర్వేద), బీహెచ్‌ఎంఎస్ (హోమియోపతి), బీడీఎస్ (డెంటల్) వైద్యులను అల్లోపతి వైద్యం అందించే ఆస్పత్రుల్లో డ్యూటీ డాక్టర్లుగా నియమించరాదు. డెంటల్ డాక్టర్లను డ్యూటీ డాక్టర్లుగా కాకుండా దంత విభాగం వైద్యులుగా నియమించాలి. కానీ జిల్లాలో ఏకంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే వీరు డ్యూటీ డాక్టర్లుగా కొనసాగిస్తున్నారు.

ఆందోళన

ఇతర జిల్లాల్లో అయితే ఆరోగ్య పరంగా అత్యవసర పరిస్థితులు ఎదురైతే ప్రజలకు ప్రభుత్వంతోపాటు ప్రైవేటు రంగంలో కూడా మంచి ఆస్పత్రులు అందుబాటులో ఉంటాయి. కానీ నూటికి తొంభై శాతం ఏజెన్సీ ప్రాంతమైన భద్రాద్రి జిల్లాలో ప్రభుత్వ ఆస్పత్రులే పెద్ద దిక్కుగా ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో డ్యూటీ డాక్టర్ల నియామకం విషయంలో ఆచితూచి వ్యవహరించాల్సి ఉంటుంది. అంతేకానీ ఎంబీబీఎస్ వైద్యులు రావడం లేదనే సాకుతో బీడీఎస్ డాక్టర్లతో పోస్టులు భర్తీ చేయడం తగదని వైద్య రంగ నిపుణులు పేర్కొంటున్నారు. పైగా బీడీఎస్ వైద్యులతో డ్యూటీ డాక్టర్ పోస్టులు భర్తీ చేయడం వల్ల భవిష్యత్తులోనూ ఈ పోస్టుల్లోకి ఎంబీబీఎస్ వైద్యులు వచ్చే అవకాశాలు సన్నగిల్లుతాయనే ఆందోళన వ్యక్తమవుతోంది.

సీజన్ మొదలైతే..

గతేడాది వైద్య విధాన పరిషత్ పరిధిలోని ఆస్పత్రుల్లో డ్యూటీ డాక్టర్ల నియామకాల సందర్భంగా ఏజెన్సీ ప్రాంతాలైన చర్ల, అశ్వారావుపేట, ఇల్లెందు, మణుగూరులలో పోస్టింగ్ తీసుకునేందుకు ఎంబీబీఎస్ వైద్యులు ఎవరూ ముందుకు రావడం లేదంటూ బీడీఎస్ వైద్యులతో ఆ పోస్టులను భర్తీ చేశారు. గడిచిన ఏడెనిమిది నెలలుగా బీడీఎస్ వైద్యులు ప్రభుత్వ ఆస్పత్రుల్లో డ్యూటీ డాక్టర్లుగా కొనసాగుతున్నా పెద్దగా ఇబ్బందులు రాలేదు. కానీ మరి కొద్ది రోజుల్లో వానాకాలం ప్రారంభం కానుంది. మలేరియా, డెంగీ వంటి జ్వరాలు విజృంభిస్తాయి. రోగులకు అత్యవసర వైద్యం ఎల్లవేళలా అందుబాటులో ఉండాల్సి వస్తుంది. ఈ నేపథ్యంలో కీలకమైన ప్రభుత్వ ఆస్పత్రుల్లో డ్యూటీ డాక్టర్లుగా ఉన్న బీడీఎస్ వైద్యులు ఎంత మేరకు సఫలం అవగలరనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అసలు ప్రాణాంతక జబ్బుల గుర్తింపు, ఔషధాలు రాసే అర్హత వారికి ఉందా అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

ప్రత్యేక పరిస్థితుల్లో..

జిల్లాలోని ఆస్పత్రుల్లో ఖాళీలు భర్తీ చేసేందుకు గతేడాది ప్రత్యేక పరిస్థితుల్లో ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకుని డెంటల్ డాక్టర్లను డ్యూటీ డాక్టర్లుగా నియమించాం. ఇప్పుడా పరిస్థితి లేదు. డ్యూటీ డాక్టర్లుగా దంతవైద్యులకు అనుమతి లేదు.

–జి.రవిబాబు, డీసీహెచ్‌ఎస్

పునాదుల్లోనే 'ప్రసాద్'..



మిథిలా స్టేడియం వెనుక పునాది దశలోనే ఉన్న ప్రసాద్ పథక భవన నిర్మాణం

- పథకం పనుల్లో అంతులేని జాప్యం
- భద్రాచలంలో రూ.41 కోట్లతో ప్రసాద్ పథకం పనులు
- 2022లో శిలాఫలకం వేసిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము
- మూడు భవనాలు నిర్మించాల్సి ఉండగా.. ఒకటే ప్రారంభం

భద్రాచలం: ప్రసాద్ పథకం పునాదులకే పరిమితమైంది. ప్రారంభించి 17 నెలలు గడిచినా, గడువు ఈ నెలాఖరుతో ముగుస్తున్నా పనులు ఇంకా బేస్‌మెంట్ దాటలేదు. కేంద్ర ప్రభుత్వం, పర్యాటక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ప్రసాద్ (పిలిగ్రిమేజ్ రెజువెనేషన్ అండ్ స్పిర్చువల్ ఆగ్మెంటేషన్ డ్రైవ్) పథకంలో భాగంగా దేశవ్యాప్తంగా పుణ్యక్షేత్రాలను, ఆధ్యాత్మిక పర్యాటక అభివృద్ధి పనులు చేపడుతున్నారు. ఈ క్రమంలో భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి, పర్ణశాలల్లో పలు అభివృద్ధి పనులకు రూ.41 కోట్లు కేటాయించారు. 2022, డిసెంబర్ 28న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము భద్రాచలం రామయ్యను దర్శించుకోగా, అనంతరం ఆలయ ప్రాంగణంలోనే వర్చువల్ పద్ధతిన ఈ పనుల ప్రారంభోత్సవం చేశారు. టెండర్ ప్రక్రియ ఆలస్యంగా గత మే 12న ఓ ప్రైవేట్ కంపెనీకి ఖరారు చేశారు. మే–2024 లోపు మూడు భవన నిర్మాణాలు పూర్తి చేయాలని గడువు నిర్దేశించారు. తొలి విడతగా రూ.22 కోట్లు విడుదల చేశారు.

రెండు భవనాల పనులే ప్రారంభించలేదు..

ఈ నెలాఖరుతో గడువు ముగియనుండగా, ఇప్పటి వరకు ఒక్క భవనం కూడా పూర్తికాలేదు. మిథిలా స్టేడియం వెనుక గతంలో వాహనాల పార్కింగ్‌గా ఉపయోగించిన స్థలంలో యాత్రికుల గదులు, వ్రత మండపాలకు సంబంధించిన భవనం నిర్మాణం ఒక్కటే సాగుతోంది. ఆ పనులు కూడా పునాది దశలోనే ఉన్నాయి. ఇక ఆర్‌అండ్‌బీ స్థలంలో ఒక భవనం, నూతనంగా నిర్మించిన గోదావరి రెండో బ్రిడ్జి పక్కనే ఉన్న ప్రభుత్వ స్థలంలో మరో భవనం నిర్మించాల్సి ఉంది. కానీ ఇంతవరకు పనులే ప్రారంభించలేదు. ఈ నేపథ్యంలో భద్రాచలం, పర్ణశాలలో పూర్తి చేయాల్సిన పనులు ఎంతకాలం పడుతుందోననే చర్చ భక్తుల్లో సాగుతోంది. నిర్మాణం చేపడుతున్న కాంట్రాక్టర్, పర్యవేక్షించాల్సిన టూరిజం శాఖ అధికారుల అలసత్వమే ఇందుకు కారణమనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



దేవస్థానం ప్రాంగణంలో రాష్ట్రపతి ప్రారంభించిన శిలాఫలకం

భక్తులను వేధిస్తున్న వసతి సమస్య

భద్రాచలంలో ప్రధానంగా భక్తులను వసతి సమస్య వేధిస్తోంది. సామాన్య, మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఉండేలా వసతి గదులు, డార్మెటరీ హాల్స్ కరువయ్యాయి. ప్రసాద్ పథకంలో నిర్మించే భవనాలు పూర్తయితే కొద్ది మేర ఉపశమనం కలిగే అవకాశం ఉంది. కానీ అవి పూర్తయ్యే పరిస్థితి కనిపించడంలేదు. ప్రతి ఏడాది దేవస్థానం ఆధ్వర్యంలో ముక్కోటి, శ్రీరామనవమి, భక్త రామదాసు జయంతి, శబరి, పోకల దమ్మక్క ఉత్సవాలను పెద్ద ఎత్తున జరుపుతున్నారు. వీటితోపాటు ఇటీవల కాలంలో భక్తుల రాక పెరిగింది. దీంతో వసతి సమస్య తీవ్రమవుతోంది.

వర్షాకాలం వస్తే..

రానున్న వర్షాకాలంలో వానలు, గోదావరి వరదలతో నిర్మాణ పనులు చురుకుగా సాగవు. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకుని 'ప్రసాద్' పనులను వేగవంతంగా పూర్తి చేయాలని భక్తులు కోరుతున్నారు. రామాలయంలో నిత్యకల్యాణ మంటప రూఫింగ్, అభయాంజనేయస్వామి ఆలయంలో, మిథిలా స్టేడియంలో డిటాచబుల్ రూఫ్‌లు, ఫ్లోరింగ్, ప్రసాదాల తయారీ విభాగపు ఆధునికీకరణ, ఇతర పనులు చేపట్టాల్సి ఉంది. ఈ సమస్యలపై దేవస్థానం అధికారులు విన్నవించుకుంటున్నా.. పనులకు 'మోక్షం' లభించలేదు. నిర్మాణ పనుల్లో జాప్యంపై వివరణ కోరేందుకు ప్రయత్నించగా.. టూరిజం శాఖ అధికారులు అందుబాటులోకి రాలేదు.

ఫిర్యాదుల పెట్టెలో కానుకలు!

భద్రాద్రి రామాలయంలో భక్తుల అయోమయం



ఫిర్యాదుల బాక్స్ నుంచి తీసిన కానుకలు మూటగడుతున్న ఆలయ సిబ్బంది

భద్రాచలంటౌన్ : భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి ఆలయ ఆవరణలో వింత ఘటన చోటుచేసుకుంది. దేవస్థానం ప్రాంగణంలోని ఆంజనేయస్వామి ఆలయం ఎదుట ఏర్పాటుచేసిన ఫిర్యాదుల పెట్టెను హుండీగా భావించిన కొందరు భక్తులు అందులో కానుకలు వేశారు. కానుకల హుండీ లోపల ఉండడంతో అయోమయానికి గురైన కొందరు భక్తులు అవగాహన లేక ఫిర్యాదుల బాక్స్‌లోనే వేశారు. అది పూర్తిగా నిండిపోవడాన్ని గమనించిన ఆలయ సిబ్బంది గురువారం ఉదయం బాక్స్ తెరిచి అందులోని కానుకలను తీశారు. రూ.10 నుంచి రూ.500 నోట్ల వరకు అందులో లభ్యమయ్యాయి. అయితే వాటిని లెక్కించకుండానే సిబ్బంది వస్త్రంలో మూటగట్టి ఆలయం లోపలికి తీసుకెళ్లారు. ఇప్పటికైనా అందరికీ అర్థమయ్యేలా ఆంజనేయస్వామి ఆలయం ఎదుట హుండీ ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.

సమస్యాత్మక గ్రామాలను గుర్తించాలి

భద్రాచలంటౌన్: భద్రాచలం ఏజెన్సీలో రాబోయే వర్షాకాలంలో గోదావరి వరదల సమస్యాత్మక గిరిజన గ్రామాలను గుర్తించాలని ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ముంపునకు గురయ్యే గ్రామాల గిరిజనులకు గోదావరి వరదల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాలని సూచించారు.

పనుల్లో నాణ్యత లేకుంటే బిల్లులు నిలిపివేస్తాం

- డీఈఓ వెంకటేశ్వరాచారి
- పడుగోనిగూడెం ప్రధానోపాధ్యాయుడికి షోకాజ్ నోటీస్..




పనులను పరిశీలిస్తున్న డీఈఓ వెంకటేశ్వరాచారి

గుండాల: అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో పాఠశాలల్లో చేపడుతున్న పనులను వేగవంతం చేయాలని, నాణ్యత లేని పనులు చేస్తే బిల్లులు నిలిపివేస్తామని జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరాచారి పేర్కొన్నారు. గురువారం ఆయన మండలంలోని పలు పాఠశాలల్లో జరుగుతున్న పనులను పరిశీలించారు. అనంతరం హైస్కూల్‌లో ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. పనులు సక్రమంగా నిర్వహించని పాఠశాల ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పడుగోనిగూడెం ఏకోపాధ్యాయ పాఠశాలలో నిధుల వినియోగంపై రికార్డులు చూపకపోవడంతో షోకాజ్ నోటీస్ జారీ చేశారు. హైస్కూల్ కాంప్లెక్స్ రికార్డులు పరిశీలించారు. నిధుల దుర్వినియోగం జరిగితే శాఖాపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ముక్తి గుంపు పాఠశాలలో మరమ్మతులు చేపట్టాల్సి ఉన్నప్పటికీ ప్రతిపాదనలు పెట్టకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మోదుగులగూడెం పాఠశాలలో వాటర్ ట్యాంక్ సరిగ్గా లేదని, వెంటనే సరిచేయాలని ఆదేశించారు. త్వరలోనే ప్రారంభం కానున్న బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. బడిబయట పిల్లలను పాఠశాలలో చేర్చాలన్నారు. ఉపాధ్యాయులు విధులు హాజరుకావాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు ఉంటాయన్నారు. ప్లానింగ్ కోఆర్డినేటర్ సతీష్ మాట్లాడుతూ యూడైస్ ప్లస్ ఆన్‌లైన్ డేటా సక్రమంగా చేయాలన్నారు. ఎఫ్‌ఆర్‌ఎస్ యాప్ ద్వారా పిల్లల హాజరు ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ సత్యనారాయణ, ఎంపీఓ పార్వతమ్మ, ఎంఈఓ పి.కృష్ణయ్య, ఎంఆర్‌సీ సిబ్బంది రంజిత్, రాజశేఖర్, రామయ్య, చంద్రయ్య పాల్గొన్నారు.

ఆ.. విత్తనమే కావాలి

పత్తి సాగుకు రైతులు సన్నద్ధం

- డిమాండ్ ఉన్న విత్తనం కోసం పరుగులు
- సుదూర ప్రాంతాలకు వెళ్తున్న రైతులు



సాక్షిప్రతినిధి, ఖమ్మం: మరికొద్ది రోజుల్లో వ్యవసాయ సీజన్ ప్రారంభం కాబోతోంది. ఈ క్రమంలో రైతులు పత్తి సాగుకు దుక్కులు దున్ని విత్తనాల కోసం దుకాణాల బాట పట్టారు. అయితే గత ఏడాది దిగుబడిని దృష్టిలో పెట్టుకున్న రైతులు ఒకే రకం పత్తి విత్తనం కావాలని అడుగుతుండడంతో ఆయా రకాలకు విపరీతమైన డిమాండ్ పెరిగింది. జిల్లాకు వచ్చిన ఆ రకం పత్తి విత్తనాలు హాట్‌కేకుల్లా అమ్ముడుపోతున్నాయి. ఎక్కువ మొత్తంలో ఈ విత్తనాలు కావాల్సిన రైతులు ఎంతదూరమైనా వెళ్లి తెచ్చుకునేందుకు సిద్ధమవుతున్నారు. అయితే వ్యవసాయ శాఖ మాత్రం మిగితా రకాల విత్తనాలతో కూడా మంచి దిగుబడి సాధించొచ్చని చెబుతోంది. జిల్లాలో ఇప్పటికే పత్తి విత్తనాలు అందుబాటులోకి వచ్చాయని, వాటిని కొనుగోలు చేయాలని సూచిస్తోంది.

భూమికి పదును రావడంతో..

ఇటీవల కురిసిన అకాల వర్షాలతో భూమికి పదును రావడంతో రైతులు దుక్కులు సిద్ధం చేస్తున్నారు. అయితే మరో వారం నుంచి 15 రోజుల్లో వర్షాలు కురిస్తే కానీ పత్తి విత్తనాలు వేసే పరిస్థితి లేదు. రైతులు మాత్రం దుక్కులు దున్ని పత్తి విత్తనాలు నాటేందుకు అంతా సిద్ధం చేసుకుంటున్నారు. జిల్లాలో ఈ ఏడాది 2,01,834 ఎకరాల్లో పత్తి సాగవుతుందని వ్యవసాయశాఖ అంచనా వేసింది. ఇక దుక్కులు సిద్ధం చేసిన రైతులు పత్తి విత్తనాల కోసం దుకాణాల బాట పట్టారు.

అందుబాటులో విత్తనాలు..

సాగులో రైతులు ఇబ్బందులు పడొద్దనే ఉద్దేశంతో ప్రభుత్వం విత్తనాలు, ఎరువులను సీజన్ కన్నా ముందుగానే అందుబాటులోకి తెచ్చింది. ఈ క్రమంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాకు అవసరమైన మొత్తం విత్తన ప్యాకెట్లు దాదాపుగా చేరుకున్నాయి. ఒక్కో ఎకరానికి రెండు ప్యాకెట్ల పత్తి విత్తనాలు అవసరమవుతాయి. 475 గ్రాముల ప్యాకెట్ ధర రూ.864 ఉంటుంది. జిల్లాలో సాగవుతున్న 2,01,834 ఎకరాలకు 4 లక్షల విత్తన ప్యాకెట్లు అవసరం. ప్రకృతి వైపరీత్యాలు, అతివృష్టి, అనావృష్టి తదితర అంశాలను దృష్టిలో పెట్టుకున్న జిల్లా అధికార యంత్రాంగం మొత్తంగా 5.60 లక్షల పత్తి విత్తన ప్యాకెట్లు తెప్పించాలని నిర్ణయించింది. ఇప్పటి వరకు 4.50 లక్షల విత్తన ప్యాకెట్లు జిల్లాకు చేరాయి. వీటిలో 45 వేల ప్యాకెట్లను విక్రయించారు. వర్షాలు కురిసి సీజన్ ప్రారంభమైన తర్వాత పరిస్థితులకు అనుగుణంగా రైతులకు విత్తనాలు అందుబాటులో ఉంచేలా వ్యవసాయ శాఖ ప్రణాళిక సిద్ధం చేసింది.

ఆ..కంపెనీ విత్తనం కోసం..

పత్తి విత్తనాల్లో 200 నుంచి 300 రకాలు ఉంటాయి. అయితే ఇప్పుడు మాత్రం ఒకే రకం కంపెనీ విత్తనానికి డిమాండ్ పెరిగింది. అధిక దిగుబడి వస్తుందన్న కారణంతో ఈ విత్తనం కావాలని రైతులు ఎగబడుతున్నారు. దిగుబడిని ఇచ్చే విత్తన రకాలు అనేకం మార్కెట్‌లో ఉన్నాయని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. రైతులకు కావాల్సిన మేరకు విత్తనాలు అందుబాటులో ఉంచామని, ఒకే రకం విత్తనాలు అధిక దిగుబడిని ఇస్తాయనే ఆలోచన మానుకోవాలని సూచిస్తున్నారు. డిమాండ్ ఉన్న విత్తనాలు జిల్లాకు 10 వేల ప్యాకెట్లు రాగా ఇవి హాట్‌కేకుల్లా అమ్ముడయ్యాయి. ఈ రకం విత్తనాల కోసం రైతులు దుకాణాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. రైతులు వీటినే కోరుతుండటంతో నిల్వ ఉండడం లేదు. దీంతో కొన్ని చోట్ల ఒక్కో రైతుకు ఒకటి, రెండు ప్యాకెట్లు మాత్రమే ఇస్తుండడంతో దుకాణాల వద్ద భారీ క్యూలు దర్శనం ఇస్తున్నాయి. కొందరు రైతులు గుంటూరు, విజయవాడ తదితర ప్రాంతాలకు వెళ్లి ఈ రకం విత్తనాలు తెచ్చుకుంటున్నారు.

ఇతర రకాలనూ కొనుగోలు చేయండి..

ఒకే రకం పత్తి విత్తనాల కోసం వేచి ఉండకుండా.. ఇతర రకాలైన మంచి పత్తి విత్తనాలను కొనుగోలు చేయాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. ఇతర రకాలు కూడా మంచి దిగుబడిని ఇస్తాయని అంటున్నారు. యూఎస్ 7067 రకానికి జిల్లాలో బాగా డిమాండ్ ఉంది. అయితే ఇతర పత్తి విత్తన రకాలైన యూఎస్ 4708, యూఎస్ 4753, యూఎస్ 704, రాశి స్విఫ్ట్, ఆర్‌సీహెచ్ 797, ప్లాటినం, సంధ్య గోల్డ్, ఆదియా, రేవంత్, మైకో (బహుబలి), డన్‌దేవ్‌ప్లస్, జంగి, ఎంఆర్‌సీ 7373, ప్రదీప్, రన్‌ధీర్, తులసి 07, అంకుర్, నవనీత్, జీహెచ్ 0029 వంటి రకాలు కూడా మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. అలాగే వీటితోపాటు ఇంకా అనేక రకాల పత్తి విత్తన ప్యాకెట్లు గతంలో దిగుబడిని ఇచ్చినవి చూసుకుని కొనుగోలు చేసుకోవచ్చునని వ్యవసాయాధికారులు రైతులకు సూచిస్తున్నారు. ఒకటే కంపెనీ, ఒకే రకానికి చెందిన పత్తి విత్తనాల కోసం రైతులు పోటీ పడొద్దని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కూడా సూచించారు.

నిర్ణీత తేదీల్లో గోల్కొండ, శాతవాహన రైళ్లు రద్దు

రేపటి నుంచి అమల్లోకి..

ఖమ్మం రాపర్తినగర్ : దక్షిణ మధ్య రైల్వే నిర్వహిస్తున్న మూడో లైన్ పనుల కారణంగా ఖమ్మం మీదుగా వెళ్లే గోల్కొండ, శాతవాహన ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిర్ణీత తేదీల్లో రద్దు చేస్తున్నట్లు ఖమ్మం రైల్వే కమర్షియల్ ట్రాఫిక్ అధికారి ఎండీ జాఫర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు నుంచి సికింద్రాబాద్, సికింద్రాబాద్ నుంచి గుంటూరు వెళ్లే గోల్కొండ ఎక్స్‌ప్రెస్ జూన్ 1, 2, 5, 6, 8, 9 తేదీల్లో, విజయవాడ నుంచి సికింద్రాబాద్ వెళ్లే శాతవాహన ఎక్స్‌ప్రెస్(12713), సికింద్రాబాద్ నుంచి విజయవాడ వెళ్లే శాతవాహన ఎక్స్‌ప్రెస్(12714) రైలును కూడా జూన్ 1, 2, 5, 6, 8, 9 తేదీల్లో రద్దు చేసినట్లు వివరించారు.

క్లుప్తంగా

కొండగట్టు అంజన్నకు రామయ్య వస్త్రాలు



కొండగట్టు ఆలయంలో పట్టువస్త్రాలతో ఈఓ రమాదేవి తదితరులు

భద్రాచలం: జగిత్యాల జిల్లా కొండగట్టులో వేంచేసి ఉన్న శ్రీ ఆంజనేయస్వామి వారికి భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయం తరఫున గురువారం పట్టువస్త్రాలు అందజేశారు. జూన్ 1న హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్న నేపథ్యంలో రామాలయ ఈఓ ఎల్.రమాదేవి పట్టువస్త్రాలతో కొండగట్టుకు వెళ్లారు. అక్కడి అర్చకులు ఆలయ మర్యాదలు, మంగళవాయిద్యాలతో స్వాగతం పలికి ఆశీర్వచనం అందించారు. కార్యక్రమంలో దేవస్థానం ఏఈఓ భవానీ రామకృష్ణ, అర్చకులు పాల్గొన్నారు.

ఉక్కపోత నుంచి ఉపశమనం..



చిన్న ఫ్యాన్ గాలితో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్

భద్రాచలం టౌన్: చిన్న బ్యాటరీ ఫ్యాన్ గాలితో ఆలయం వద్ద విధులు నిర్వర్తిస్తున్న ఓ కానిస్టేబుల్ ఎండ నుంచి ఉపశమనం పొందేందుకు చేసిన పనికి ప్రశంసలు అందుకున్నాడు. రోహిణి కార్తె ఈ నెల 25 నుంచి ప్రారంభం కావడంతో ఎండతో పాటు ఉక్కపోత పెరిగింది. ఈనేపథ్యాన గురువారం భద్రాచలం రామాలయం వద్ద విధులు నిర్వహిస్తున్న ఓ కానిస్టేబుల్ ఎండ తీవ్రత వలన ఉక్కపోత నుంచి తట్టుకునేందుకు చేతితో పట్టుకునే చిన్న బ్యాటరీ ఫ్యాన్‌తో ఉపశమనం పొందే దృశ్యం పలువురిని ఆకర్షించింది. ఇది గమనించిన భక్తులు కానిస్టేబుల్ ఆలోచనకు ''వాట్ ఆన్ ఐడియా సార్ జీ''అంటూ ప్రశంసించారు.

డ్రైవర్ల సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా పంతులు



తేజావత్ పంతులు

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ ప్రభుత్వ డ్రైవర్ల సంఘం ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షుడు ఎండీ అబ్దుల్ హకీం విదేశీ పర్యటనకు వెళ్తున్న క్రమంలో తేజావత్ పంతులుకు పూర్తి బాధ్యతలు అప్పగించారు. పంతులు సంఘంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా పని చేసిన అనుభవంతో పాటు రాష్ట్ర నాయకుడు, ఉమ్మడి ఖమ్మం జిల్లా సభ్యుడిగా ఉన్న నేపథ్యాన పంతులుకు ఈ బాధ్యతలు అప్పగించినట్లు హకీం తెలిపారు. ఉద్యోగుల సమస్యలను పంతులు ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు.

రైలు కిందపడి రిటైర్డ్ ఉద్యోగి ఆత్మహత్య

చింతకాని: మండల పరిధిలోని రామకృష్ణాపురం రైల్వే స్టేషన్ సమీపాన కర్లపూడి నాగభూషణం(59) అనే రిటైర్డ్ ఉద్యోగి గురువారం రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం బీకే బజారుకు చెందిన నాగభూషణం ఖమ్మం ఎస్డీఓ కార్యాలయంలో అటెండర్‌గా పనిచేసి పదవీ విరమణ పొందాడు. ఆయన కొంతకాలంగా కేన్సర్‌తో బాధపడుతూ హైదరాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అనారోగ్య సమస్యను తట్టుకోలేక గోల్కొండ ఎక్స్‌ప్రెస్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని అన్నం సేవా ఫౌండేషన్ నిర్వాహకులు అన్నం శ్రీనివాసరావు బృందం ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ప్రాణం తీసిన మద్యం మత్తు..

ఖమ్మంక్రైం: తాను తాగిన మద్యం మత్తే అతడికి శాపమైంది. పొట్టచేతితో పట్టుకొని రాష్ట్ర సరిహద్దులు దాటివచ్చిన అతడు మత్తులో విగతజీవిగా మారాడు. వనటౌన్ సీఐ ఉదయ్‌కుమార్ కథనం ప్రకారం.. రాజస్తాన్‌కు చెందిన అమిత్‌కుమార్ (27) కొంతకాలంగా నగరంలోని కమాన్‌బజార్‌లో నివాసం ఉంటూ పచ్చబొట్టు షాపులో పనిచేస్తున్నాడు. మద్యానికి బానిసైన అతను గతంలో ఉన్న తనరూమ్‌ను ఖాళీ చేసి ఇటీవల తనతో పాటు పనిచేసే దీపక్ కుమార్ రూమ్‌లో ఉంటున్నాడు. అయితే బుధవారం రాత్రి కూడా మద్యం సేవించి వచ్చిన అతను కిటికీ అద్దాలను బలంగా కొట్టడంతో చేతికి తీవ్ర గాయమైంది. మద్యం మత్తులో ఉన్న అతడి స్నేహితుడు గమనించకపోవడంతో ఆ రాత్రి తీవ్ర రక్తస్రావమై ప్రాణాలు వదిలాడు. గురువారం ఉదయం లేచిన దీపక్ కుమార్ రక్తపు మడుగులో అమిత్‌కుమార్ కనిపించడంతో వెంటనే స్థానికులను పిలవగా వారు వచ్చి చూడగా అప్పటికే మృతిచెంది ఉన్నాడు. పోలీసులకు సమాచారం అందించగా వారు మృతదేహాన్ని మార్చురికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.14,229

పొగ.. సెగ..!



జిల్లాలో పొగాకు ఉత్పత్తుల వాడకం నానాటికీ పెరుగుతోంది. పిల్లల నుంచి పెద్దల వరకు బీడీ, సిగరెట్, చుట్ట, ఖైనీ, గుట్కా వంటివి నమలడంతో ఎక్కువ మంది నోటి, ఊపిరితిత్తుల కేన్సర్ల బారిన పడుతున్నారు. పొగ ఊపిరి సలపనివ్వదు.. తట్టుకోలేం. సెగ మంటపుట్టిస్తుంది.. భరించలేం. అయినా పొగ.. సెగ.. రెంటినీ కలిపి ఆస్వాదిస్తారు కొందరు. పొగాకు ఉత్పత్తులకు యువతే ఎక్కువగా అలవాటు పడి తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు. మత్తులో కొందరు నేరాలకు సైతం పాల్పడుతున్నారు. వాటికి దూరంగా ఉండడంతో పాటు ముందుగానే మేల్కొంటే ప్రాణాపాయం నుంచి తప్పించుకోవచ్చునని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

– పాల్వంచరూరల్

పొగతో ఆరోగ్యానికి పగ

- యథేచ్ఛగా పొగాకు ఉత్పత్తుల వినియోగం
- యువతపై అధిక ప్రభావం
- బహిరంగ ప్రదేశాల్లో అటకెక్కిన నిషేధం
- అవగాహన కల్పించడంతో అధికారులు విఫలం
- జిల్లాలో 322 మందికి కేన్సర్, మరో 20 మందికి ఊపిరితిత్తుల కేన్సర్

నేడు ప్రపంచ పొగాకు నివారణ దినోత్సవం



పొగాకుతో 'చుట్ట'రికం..

పొగాకు కారకాల వల్ల ఏటా అనేక మంది కేన్సర్ బారిన పడి తమ జీవితాలను సగంలోనే ముగిస్తున్నారు. పొగ తాగడం వల్లే కాదు పీల్చడం, నమలడం వల్ల కూడా ఆరోగ్యానికి హానికరంగా మారుతోంది. సిగరెట్, చుట్ట, బీడీ, తంబాకు, గుట్కాల్లో ఉండే పలు రకాలైన విష పదార్థాలు ఎర్రరక్త కణాలు దెబ్బతీస్తుందని, ఆక్సిజన్‌ను అందకుండా చేస్తుందని, అందులోని నికోటిన్ కారణంగా నరాలు చచ్చుబడడం, రక్తపోటు, గుండెపోటు, పక్షవాతలకు గురవుతారని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. పొగాకు పొగలో ఉండే నైట్రోసాకాంపౌడ్స్ వల్ల ఊపిరితిత్తులు, నోరు, అన్నవాహిక, సీరుడు నుంచి కేన్సర్ సంక్రమిస్తుందని, దానిలోని తారు అనే పదార్థం వల్ల ఊపిరితిత్తుల్లోని గాలిగొట్టాలు దెబ్బతింటాయని హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యాన జిల్లాలో పొగాకు ఉత్పత్తుల వినియోగంతో 322 మంది కేన్సర్, మరో 20 మందికి ఊపిరితిత్తుల కేన్సర్ బారిన పడినట్లు వైద్యాధికారులు చెబుతున్నారు.

పట్టించుకోని అధికారులు..

బహిరంగ ప్రదేశాల్లో పొగతాగడం, గుట్కాలు, పాన్‌పరాగ్‌లు నమలడం వంటివి 2008లో కేంద్ర ప్రభుత్వం నిషేధించింది. దుకాణాలు, 14 ఏళ్లలోపు బాలలకు అమ్మకాలను నిషేధించినా.. ఎక్కడా అమలైనా దాఖలాలు కన్పించడం లేదు. పొగాకు ఉత్పత్తుల విక్రయాలను అరికట్టాల్సిన పోలీసు యంత్రాంగం, స్థానిక సంస్థలు, మున్సిపాలిటీలు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నాయి. రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు, ఆస్పత్రులు, విద్యాలయాలు, సినిమా థియేటర్లు, మార్కెట్లు తదితర ప్రదేశాల్లో విచ్చలవిడిగా లభిస్తున్నాయి. వీటిని ప్రత్యక్షంగా చూస్తున్నా.. అరికట్టే ప్రయత్నం చేయకపోగా.. కొంతమంది అధికారులు, ప్రజాప్రతినిధులు నిబంధనలు అతిక్రమిస్తున్న ఘటనలు కోకొల్లలుగా ఉన్నాయి.

అవగాహన లోపం, అటకెక్కిన నిషేధాలు..

పొగాకు వినియోగంపై నిషేధం విధించినా.. ఆచరణలో అమలు కావడంలేదు. వివిధ రూపాల్లో బహిర్గత మార్కెట్‌లో లభించే పొగాకు ఉత్పత్తులైన సిగరెట్, బీడీ, చుట్టా, తంబాకు, అంబర్, జర్దా వంటి వాటికి అలవాటుపడి మానుకోలేని దుస్థితి నేడు నెలకొంది. ఒక్కసారి వాటికి అలవాటు పడితే చివరి వరకు వదలడం లేదు. ముఖ్యంగా యువతను ఇది పట్టి పీడిస్తోంది. పొగాకు ఉత్పత్తులకు నేటి యువత బానిసలుగా మారి తమ నూరేళ్ల జీవితాలను మధ్యలోనే అర్ధాంతరంగా నాశనం చేసుకుంటున్నారు. ప్రాణాంతకమైన పొగాకు ఉత్పత్తులను వినియోగించొద్దని వైద్యులు పదే పదే చెబుతున్నా.. ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. వాటిని అరికట్టడానికి విస్తృత ప్రచారం చేయాల్సి ఉండగా.. అధికారులు పట్టించుకోకపోవడంతో వాటి వినియోగం నానాటికీ పెరిగిపోతోంది. ఇప్పటికైనా అధికారులు ముమ్మరంగా ప్రచారం నిర్వహించాలి.

ఇతర పంటలకు ప్రోత్సాహం ఏది?

పొగాకు పంటను అరికట్టి ఇతర పంటలను ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. కేవలం ప్రకటనలకే కాకుండా పొగాకు వినియోగాన్ని అరికట్టలేకపోతున్నారు. పొగాకు పంటపై ఆధారపడిన రైతులు, కూలీల జీవన ప్రమాణాలు దెబ్బ తినకుండా ఇతర పంటలను ప్రోత్సహించాలి. పొగాకు పంటకు నీటి వినియోగం కూడా ఎక్కువ కాబట్టి ఇతర పంటలపై దృష్టి సారించేలా ప్రభుత్వం అవగాహన కార్యక్రమాలను జాగృతం చేయాలి.

90 శాతం రోగాలు పొగాకువల్లే..



90శాతం రోగాలు పొగాకు ఉత్పత్తుల వినియోగం వల్లే వస్తున్నాయి. ధూమపానం, గుట్కాలు, జర్దాలు, మద్యం వల్ల రోగాలు అధికంగా వస్తున్నాయి. పొగ పీల్చడం, గుట్కాలు నమలడం, మద్యం సేవించడం వలన గర్భిణుల్లో గర్భస్రావం, పిల్లలు వికలాంగులుగా పుట్టే ప్రమాదం కూడా ఉంది. పొగాకులోని వివిధ రసాయనాల వలన కేన్సర్లు సోకే ప్రమాదం ఉంది.

– సోమరాజ్ దొర, ప్రభుత్వ వైద్యుడు, పాల్వంచ

అవగాహన కల్పించి జాగృతం చేస్తున్నాం..



పొగాకు ఉత్పత్తులను వినియోగించవద్దని ప్రజలకు అవగాహన కల్పించి జాగృతం చేస్తున్నాం. జిల్లా కేంద్రంతో పాటు అన్ని పీహెచ్‌సీల పరిధిలో ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహిస్తాం. విద్యా సంస్థలకు దగ్గరలో పొగాకు ఉత్పత్తులను విక్రయించరాదు. విద్యాలయాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో నో స్మోకింగ్ సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారిచేశాం.

– శిరీష, జిల్లా వైద్యాధికారి

మావోయిస్టు మిలీషియా దంపతుల లొంగుబాటు..



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు

కొత్తగూడెంటౌన్/చర్ల : సీపీఐ నిషేధిత మావోయిస్టు పార్టీకి చెందిన మడకం లింగా, మడవి గంగి అనే మిలీషియా దంపతులు పోలీసుల ఎదుట లొంగిపోయారు. గురువారం కొత్తగూడెంలోని జిల్లా ఎస్పీ కార్యాలయం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ రోహిత్‌రాజు లొంగిపోయిన దంపతులు మిలీషియా సభ్యులుగా కొనసాగిన వారి వివరాలను వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కుసుమ జిల్లా పొట్టిమంగు గ్రామం, చింతగుప్ప కృష్టారం పీఎస్ పరిధిలకు చెందిన వారు సీఆర్‌పీఎఫ్ 81 బెటాలియన్, 141 బెటాలియన్, జిల్లా పోలీసుల ఎదుట లొంగిపోయారని తెలిపారు. మడకం లింగా 2009 ఏడాదిలో మిలిషియా కమాండర్ ఏర్రా సమక్షంలో మావోయిస్టు పార్టీలో చేరారని, 2010 వరకు మిలీషియా సభ్యుడిగా చేసిన అనంతరం 2014 వరకు హరిభూషన్ టీం ప్రొటెక్షన్‌కు బదిలీ చేశారన్నారు. 2014లో ఏరియా కమిటీ సభ్యుడిగా పదోన్నతి పొంది మణుగురు ఏరియా ఎల్‌జీఎస్ కమాండర్‌గా ఇప్పటి వరకు కొనసాగాడని చెప్పారు. అదేవిధంగా మడవి గంగి 2011లో చర్ల మిలీషియా కమాండర్ అయిన పోడియం జయరాం సమక్షంలో మావోయిస్టు పార్టీలో చేరి 2013 ఏడాది వరకు సీఎన్ఎం (చైతన్య నాట్యం మండలి)లో సభ్యురాలిగా, 2014 వరకు చర్ల ఏరియా మిలీషియా సభ్యురాలిగా ఉందని తెలిపారు. 2014 నుంచి 2018 వరకు హరిభూషన్ ప్రొటెక్షన్ టీంలో 2018 వరకు పని చేసిందని ఆ తరువాత మడకం లింగాను వివాహం చేసుకున్నట్లు తెలిపారు. తరువాత ఏరియా కమిటీ సభ్యురాలిగా పదోన్నతిని పొంది ఇప్పటి వరకు సీపీఐ నిషేధిత మావోయిస్టు పార్టీలో కొనసాగిందన్నారు. నిషేధిత మావోయిస్టు పార్టీ అగ్ర నాయకులు వేధింపులు తాళలేక, ప్రశాంతమైన జీవితాన్ని గడపాలనే ఉద్దేశంతో ఆపరేషన్ చేయూతతో ఆకర్షితులై లొంగిపోయినట్లు దంపతులు తెలిపినట్లు చెప్పారు. లొంగిపోయిన వారు ప్రశాంత జీవితం గడపాలనుకునే దళం సభ్యులు వారి కుటుంబ సభ్యులు ద్వారా కాని స్వయంగా తమ దగ్గరలోని పోలీసు స్టేషన్‌లో, జిల్లా ఉన్నతాధికారులను సంప్రదించాలని అన్నారు. లొంగిపోయిన మావోయిస్టులకు జీవనోపాధిని కల్పించడం, పునరావసం కల్పించడం కోసం ప్రభుత్వం తరఫున అందించాల్సిన అన్ని రకాల ప్రతిఫలాలను అందించడానికి జిల్లా పోలీసు యంత్రాంగం కృషి చేస్తుందని జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు అన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ టి.సాయి మనోహర్, భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్, చర్ల సీఐ రాజువర్మ, ఎస్సై నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో యువకుడి హత్య..

- కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్‌లో యువకుల మధ్య ఘర్షణ
- పరారీలో నిందితుడు
- సంఘటన స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ అబ్దుల్ రెహమాన్



ఘటన స్థలం వద్ద వివరాలు తెలుసుకుంటున్న డీఎస్పీ రెహమాన్



గుణదీప్ (ఫైల్)

కొత్తగూడెంటౌన్: పట్టపగలు మద్యంమత్తులో ఇద్దరు వ్యక్తులు గొడవ పడ్డారు. ఎవరు చెప్పినా వినకుండా విచక్షణారహితంగా ఒకరినొకరు కొట్టుకున్నారు. దీంతో ఓ యువకుడు మరణించగా.. నిందితుడు పరారీలో ఉన్నాడు. స్థానికులు, స్నేహితుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. కొత్తగూడెం కూలీలైన్‌కు చెందిన ఎల్లబోయిన సమ్మయ్య (లేట్), లలిత దంపతులకు హిమవంత్, గుణదీప్(22) అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇందులో గుణదీప్ హైదరాబాద్‌లో బీటెక్ చివరి సంవత్సరం చదువుతున్నారు. బుధవారం సాయంకాలం కొత్తగూడెం తాటిపల్లి రెసిడెన్సీ సమీపాన గుణదీప్‌తో పాటు అతడి స్నేహితులతో గొడవ పడ్డాడని, గురువారం గుణదీప్‌ను తన ఇంటి వద్ద నుంచి గంగా అనే మిత్రుడు మధ్యాహ్నం సమయాన బయటికి తీసుకెళ్లాడు. కొత్తగూడెం వన్‌టౌన్ పోస్టాఫీస్ సెంటర్‌లోని ఖమ్మం బస్టాండ్ సెంటర్ సమీపాన ఉన్న మద్యం షాపుకు గుణదీప్, గంగాలు వెళ్లారు. ఈ క్రమంలో విద్యానగర్ కాలనీకి చెందిన కోటి అనే వ్యక్తి అక్కడకు వచ్చాడు. అయితే గుణదీప్ అన్నయ్య హిమవంత్‌కు విద్యానగర్ కాలనీలో ఉన్న స్నేహితులకు కోటికి మధ్య ఘర్షణలు జరిగాయని ఆ గొడవను దృష్టిలో పెట్టుకుని హిమవంత్ తమ్ముడిపై కోటి విచక్షణా రహితంగా దాడి చేయడంతో గుణదీప్ మరణించారని స్థానికులు పేర్కొన్నారు. గుణదీప్‌తో పాటు వచ్చిన గంగా పోలీసుల అదుపులో ఉన్నట్టు సమాచారం. గుణదీప్ మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రికి స్థానికులు తరలించగా.. ఘటన స్థలాన్ని కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ కొత్తగూడెం వన్‌టౌన్ సీఐ కరుణాకర్, శివప్రసాద్, ఎస్సై రవిలతో సందర్శించి హత్య జరిగిన తీరును స్థానికులను అడిగి తెలుసుకుని నేరానికి పాల్పడిన వ్యక్తిని పట్టుకుంటామన్నారు. కాగా, గుణదీప్ మరణవార్తను గోదావరిఖనిలో సింగరేణి ఉద్యోగం చేస్తున్న అతడి అన్న హిమవంత్‌కు సమాచారం అందించారు. తల్లి ఒంటరిగా ఉండి రోదించడం అందరిని కలచి వేసింది.

పంచాయతీ టేకు ప్లాంటుకు నిప్పు



తగలబడుతున్న టేకు ప్లాంటు

చర్ల రూరల్: చర్ల మేజర్ పంచాయతీ టేకు ప్లాంటుకు నిప్పంటుకుంది. గురువారం రాత్రి 8 గంటల సమయాన చర్ల శ్మశానవాటికకు వెళ్లే దారిలో ఉన్న టేకు ప్లాంటు వద్ద అకస్మాత్తుగా మంటలు చెలరేగడంలో గమనించిన స్థానికులు మంటలు ఆర్పేందుకు ప్రయత్నించారు. ఒకవేళ అర్ధరాత్రి సమయాన మంటలు చెలరేగి ఉంటే పెద్ద ప్రమాదమే జరిగి ఉండేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

ములకలపల్లి: ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు సీజ్ చేశారు. ఎస్సై రాజమౌళి కథనం మేరకు.. మండల పరిధిలోని గుర్రాలకుంట శివకు ముర్రేడువాగు నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందింది. ఈ మేరకు దాడులు నిర్వహించి ట్రాక్టర్ స్వాధీనం చేసుకున్నామని, కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

దాబా పైనుంచి పడి వ్యక్తి మృతి

పాల్వంచరూరల్: దాబాపై పడుకున్న ఓ వ్యక్తి మూత్ర విసర్జనకు లేచి ప్రమాదవశాత్తు కిందపడి మృతిచెందిన సంఘటన మండలంలోని లక్ష్మీదేవిపల్లిలో చోటు చేసుకుంది. ఎస్సైశ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మీదేవిపల్లి మండలం కోమరంభీమ్ కాలనీకి చెందిన చెంచు సర్వయ్య(55) పాల్వంచ మండలం లక్ష్మీదేవిపల్లిలోని కుమార్తె జ్యోతిర్మయి ఇంటికి వచ్చాడు. బుధవారం రాత్రి దాబాపై పడుకున్న ఆయన రాత్రి సమయాన మూత్ర విసర్జన కోసం లేచి ప్రమాదవశాత్తు భవనం పైనుంచి కిందపడ్డాడు. దీంతో తీవ్రగాయలైన ఆయనను ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. చెంచు ఉపేందర్ ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అత్తగారింటి వద్ద పురుగు మందు తాగి అల్లుడు..

పాల్వంచరూరల్: అత్తగారి ఇంటికి వచ్చిన అల్లుడు భార్య కాపురానికి రావడంలేదని మనస్తాపం చెంది పురుగుమందు తాగి మృతిచెందిన సంఘటన కారెగట్టులో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధి కారెగట్టు గ్రామానికి అశ్వాపురం మండలం గొందిగూడెంకు చెందిన కొమరం రాము(32) బుధవారం అత్తగారింటికి వచ్చాడు. భార్య అరుణ కాపురానికి రావడంలేదని పురుగు మందు తాగగా అపస్మారక స్థితిలోకి చేరుకున్నాడు. దీంతో ఏరియా ఆస్పత్రికి ఆపై కొత్తగూడెంకు తరలించిగా అక్కడ చికిత్స పొందుతూ రాత్రి సమయంలో మృతి చెందాడు. కొమరం పెద్దగుండురాజులు ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..

కొత్తగూడెంరూరల్: పాల్వంచ మండలం గట్టాయిగూడెం గ్రామానికి చెందిన శెట్టి తరుణ్ (23) తన స్నేహితుడిని కలవడానికి ఇల్లెందుకు స్కూటీపై వెళ్తున్నాడు. ఈ క్రమంలో లక్ష్మీదేవిపల్లి మండలం అనిశెట్టి పల్లిగ్రామం వద్దకు రాగానే వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొట్టింది. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

అనారోగ్యంతో విలేకరి మృతి

ఇల్లెందు: ఇల్లెందులో వివిధ పత్రికలలో విలేకరిగా పని చేసిన తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు(45) నాలుగు రోజుల క్రితం అనారోగ్యానికి గురయ్యారు. దీంతో కుటుంబ సభ్యులు ఖమ్మం ఆస్పత్రికి తరలించగా.. బ్రెయిన్ స్ట్రోక్‌తో తుది శ్వాస విడిచారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కారేపల్లి మండలం ఎర్రబోడు మాణిక్యారం గ్రామానికి చెందిన ఆయన ఇల్లెందులో నివాసం ఉంటున్నాడు. ఈమేరకు పలువురు జర్నలిస్టులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత

కేంద్ర ప్రభుత్వ పర్యావరణ డైరెక్టర్ కత్తుల తరుణ్



కేఓసీలో మొక్కలను పరిశీలిస్తున్న డైరెక్టర్ తరుణ్‌కుమార్

టేకులపల్లి: పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత అని కేంద్ర ప్రభుత్వ పర్యావరణం, అటవీ మంత్రిత్వ శాఖ, హైదరాబాద్ విభాగ డైరెక్టర్, సైంటిస్టు కత్తుల తరుణ్‌కుమార్ అన్నారు. గురువారం ఈ మేరకు కోయగూడెం ఓపెన్‌కాస్టులో పర్యటించారు. ఏరియా జనరల్ మేనేజర్ జాన్ ఆనంద్, జీఎం కార్పొరేట్(ఎన్విరాన్మెంట్) జేవీఎల్ గణపతి, కోయగూడెం ఉపరితల గని అధికారులు డైరెక్టర్‌కు సాదర స్వాగతం పలికారు. అనంతరం కోయగూడెం ఉపరితల గని వద్ద పర్యావరణ పరిరక్షణ కోసం చేపడుతున్న చర్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. వ్యూ పాయింట్ నుంచి క్వారీలో జరుగుతున్న బొగ్గు ఉత్పత్తి ప్రక్రియను పరిశీలించి రోజు వారి ఉత్పత్తి వివరాలను ఏరియా జనరల్ మేనేజర్ జాన్ ఆనంద్‌ను అడిగారు. అనంతరం మొక్కల పెంపకం, ఇంకుడు గుంతలు, రాక్‌టో వాల్, ఈటీపీ, ఎస్‌టీపీ, నీటిని శుద్ధి చేయు తీరుపై ఆరా తీసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం కేఓసీ ఉపరితల గనిలో మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో కోయగూడెం ప్రాజెక్ట్ అధికారి వి.శ్రీనివాసరావు, మేనేజర్ రాజు, ప్రాజెక్ట్ ఇంజనీర్ శివ శంకర్, డీజీఎం ఫారెస్ట్ హరినారాయణ, ఏరియా పర్యావరణ అధికారి ధనుంజయరెడ్డి, రవి కిరణ్, కార్పొరేట్ పర్యావరణ విభాగం అడిషనల్ మేనేజర్, సీహెచ్. శ్రీనివాస్, ఇతర అధికారులు శ్రీకాంత్, నరేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మన్నికకు పేరెన్నిక భారతి సిమెంట్

తాపీ మేస్త్రీల సమావేశంలో ఇంజనీర్ సాగర్ రెడ్డి



తాపీ మేస్త్రీలకు ప్రమాద బీమా బాండ్లు అందజేస్తున్న భారతి సిమెంట్ ప్రతినిధులు

ఇల్లెందు: సిమెంట్ వ్యాపారంలో తిరుగులేని సంస్థగా ఎదుగుతున్న భారతి సిమెంట్ అల్ట్రాఫస్ట్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్‌ను రాష్ట్రంలో విడుదల చేసిందని సంస్థ ఏరియా సేల్స్ ఇన్‌చార్జ్ విజయ సింహ తెలిపారు. సిమెంట్ రంగంలో ఇతర సంస్థలతో పోలిస్తే మూడు రేట్లు మెరుగైందని సంస్థ టెక్నికల్ ఇంజనీర్ సాగర్ రెడ్డి అన్నారు. ఇల్లెందులోని శివ కేశవ సిమెంట్, ఐరన్ షాప్‌లో గురువారం తాపీ మేస్త్రీలతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు వివరాలు వెల్లడించారు. మార్కెట్‌లో లభించే ఇతర రకాల సిమెంట్‌తో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ చాలా వేగంగా పూర్తవుతుందని తెలిపారు. ముఖ్యంగా శ్లాబులు, పిల్లర్లు, బ్రిడ్జిలు, రహదారుల నిర్మాణానికి ఈ సిమెంట్ ఉత్తమమైందని పేర్కొన్నారు. జెర్మనీ టెక్నాలజీ, రోబోటిక్ ల్యాబ్, టాంపరింగ్ ప్రూఫ్ బ్యాగ్‌తో సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. భారతి సిమెంట్ వినియోగదారులకు ఉచిత సాంకేతిక సహాయం అందజేస్తామని, స్లాబ్ కాంక్రిట్ సమయంలో నిపుణులైన ఇంజనీర్లు సైట్ వద్దకే వచ్చి సహాయ పడుతారని తెలిపారు. ఈ సందర్భంగా 60 మంది తాపీ మేస్త్రీలకు రూ.లక్ష ఉచిత ప్రమాద బీమా బాండ్లు అందజేశారు. కార్యక్రమంలో డీలర్ శ్రీకాంత్, తాపీ మేస్త్రీలు పాల్గొన్నారు.

తాగునీటి కోసం రోడ్డెక్కిన జనం



రోడ్డుపై ఖాళీ బిందెలతో బైఠాయించిన మహిళలు

జూలూరుపాడు: తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ ప్రజలు రోడ్డెక్కిన సంఘటన గురువారం జూలూరుపాడు మండలం వినోభానగర్ గ్రామంలో చోటు చేసుకుంది. మహిళలు ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతూ.. తల్లాడ–కొత్తగూడెం ప్రధాన రహదారిపై బైఠాయించి ధర్నా చేపట్టారు. దీంతో రోడ్డుపై వాహనాల రాకపోకలు నిలిచిపోవడంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. ఈ సందర్భంగా గ్రామస్తులు, మహిళలు మాట్లాడుతూ.. గ్రామంలో రెండు మిషన్ భగీరథ ట్యాంకులు ఉన్నప్పటికీ ఒకటి, రెండు బిందెలు వస్తుండడంతో గత 20 రోజులుగా తాగటానికి నీళ్లు లేక అవస్థలు పడుతున్నట్లు చెప్పారు. మూడు వారాల క్రితం డీపీ విద్యుత్ మోటార్ కాలిపోయి మరమ్మతులకు గురైందని, గ్రామ పంచాయతీ నీటి ట్యాంకర్‌తో సరఫరా చేయాలని కోరితే నిధులు లేవని చెబుతున్నారని వాపోయారు. తాగునీటి సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈమేరకు గ్రామస్తులు, మహిళలు రోడ్డుపై ధర్నా చేపట్టగా.. విషయం తెలుసుకున్న జూలూరుపాడు ఎస్ఐ జీవన్ రాజు పోలీస్ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని గ్రామస్తులతో మాట్లాడారు. ఎన్నికల కోడ్ సమయాన రోడ్డుపై ధర్నా చేయడం సరైంది కాదని, ట్యాంకర్ సాయంతో తాగునీటి సరఫరా చేయిస్తామని చెప్పడంతో వారు ఆందోళన విరమించారు. ఈమేరకు ట్యాంకర్‌తో ఇంటింటికి నీటి సరఫరా చేసే ప్రక్రియను ఎస్ఐ జీవన్‌రాజు, పంచాయతీ సెక్రటరీ చరిత్‌రాజ్‌లు పరిశీలించి తాగునీటి సమస్య తలెత్తకుండా చూస్తామన్నారు. అంతేకాక ఇంట్రా విలేజ్ ఈఈ తిరుమలేశ్వరరావు, డీఈ శివయ్య, ఎంపీడీఓ కరుణాకర్‌రెడ్డి, ఎంపీఓ తులసి రామ్‌లు వినోభానగర్‌లో పర్యటించారు. అధికారుల పర్యవేక్షణలో మరమ్మతులకు గురైన డీపీ విద్యుత్ మోటార్ స్థానంలో కొత్త విద్యుత్ మోటార్‌ను అమర్చి మిషన్ భగీరథ ట్యాంకుల్లో నీటిని నింపి, ఇంటింటికి సరఫరా అయ్యేలా చర్యలు చేపట్టడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Services

BUSINESS OFFER

కంపెనీ అన్ని రకాల బిజినెస్ ల్యాప్ ప్రాజెక్ట్‌ను అందిస్తుంది.వ్యక్తిగత,విద్య,టేక్‌ఓవర్ అగ్రికల్చర్ ఏజెంట్‌కావలెను.DMA Welcome, Salary + కమీషన్ ఆఫీసు, ఖర్చులు, ✆ 9253560455. [T-1262254]

CHANGE OF NAME

I, BALUSU DIVYA W/o RAVI KAMATHAM (No 15147959W, Rank:HAV, Unit 290 MED Regt) R/o Bayyaram(V), Madhira (M), Khammam(D).T.G My name after my marriage with RAVI KAMATHAM was changed as KAMATHAM DIVYA. Hence both names are one and same. My date of birth recorded in my Husband's service records incorrectly recorded 15-04-1987. My actual & correct Date Of Birth 15-04-1990 [J-753598]

Wanted

ఖమ్మంలోని వెలాసిటీ Network నందు చేయుటకు సేల్స్ & మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, టెలికాలర్స్, టెక్నికల్, ఫైబర్స్, హెల్పర్స్ వెంటనే కావలెను. సంప్ర. 9908022621, 8886661780 [M-1233991]

ఖమ్మంలోని ప్రముఖ సంస్థలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ మరియు సూపర్ వైజర్స్ వెంటనే కావలెను. జీతం: 12-15 వేలు. సంప్ర:: 8500915250, 7036191924. [M-1185095]

ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/- మీ పేరు, అడ్రస్ కాల్/వాట్సప్ చేయగలరు. 95026 15217 [M-1185092]

ప్రకటన గోరంత! స్పందన కొండంత!!

సాక్షి క్లాసిఫైడ్స్

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు మా ప్రతినిధులను సంప్రదించండి

వివరాలకు :

ఖమ్మం	9705444182
	9010299957
కొత్తగూడెం	9010223783
పాల్వంచ	9705444183
భద్రాచలం	9951602914
మణుగూరు	9705944416
సత్తుపల్లి	9652868642
మధిర	9949927792

సాక్షి ద్వారా మీ చిన్నారి పుట్టిన రోజు శుభాకాంక్షలను తెలియజేయండి

కేవలం రూ. 500/- మాత్రమే

(GST 5% అదనం)

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందం చాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.